# శ్రీవారి సన్నిధిలో హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్నను హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా శనివారం ఉదయం దర్శించుకున్నారు. మొదట ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వాదం చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్‌ఎన్.మూర్తి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందించారు.

జడ్జికి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఇఒ

# స్వతంత్ర, వర్గ పోరాటాలను.. విస్తృతం చేయాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు

## అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో జిల్లా ప్రతినిధుల సభ ప్రారంభం

మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జిల్లాలో స్వతంత్ర, వర్గ పోరాటాలను విస్తృతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం ఏలూరు జిల్లా 26వ మహాసభ ప్రారంభం సందర్భంగా తొలిరోజు శుక్రవారం భారీ ప్రదర్శన, భహిరంగ సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. శనివారం రెండో రోజు ప్రతినిధుల సభ అంత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమైంది. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు గుత్తుకొండ వెంకటకృష్ణారావు ఆవిష్కరించారు. అనంతరం మహాసభ అధ్యక్ష వర్గం తీర్మానాల కమిటీ, మినిట్స్ కమిటీ, అర్హతల కమిటీలను ఎన్నుకుంది. తెల్లం రామకృష్ణ, డిఎన్‌విడి ప్రసాద్, కె.శ్రీనివాస్, ఎం.జీవరత్నం, ఎన్.పద్మాంజలి అధ్యక్ష వర్గంగా ప్రారంభమైన సభలో సంతాప తీర్మానాన్ని గుడిపాటి నరసింహారావు ప్రవేశపెట్టారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా సీనియర్ నాయకులు మాజీ ఎంఎల్‌ఎ ఆర్.సత్యనారాయణ రాజు (ఆర్‌ఎస్) తదితర నాయకులు, కార్యకర్తలు మహాసభ ఘనంగా నివాళులర్పించింది. నేతల ఫొటోలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, జిల్లా నేతలు పూల మాలలు వేసి జోహార్లర్పించారు. అనంతరం వి.ఉమా మహేశ్వరరావు ప్రారంభ ఉపన్యాయం చేస్తూ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి అంత్యంత ప్రాధాన్యత, ఘన చరిత్ర ఉందని ఏజెన్సీలో భూపోరాటాలు ఇతర ప్రాంతాల్లో కార్మికులు, స్థానిక సమస్యలపై పోరాటాలతో ఎన్నో విజయాలు సాధించిన ఘనత ఉందన్నారు. జిల్లాలో స్వాతంత్రోద్యమంలో నిబద్ధతతో ఉద్యమం చేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం కమ్యూనిస్టులకే సాధ్యమైందన్నారు. సమాజానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2047 విజన్ అంటూ నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి అంటూ శక్తి, సంపద, సామగ్రాభివృద్ధి అంటూ నిత్యం కార్పొరేట్ల జపం చేస్తున్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, నాణ్యమైన విద్యుత్ ఇస్తానని హామీ ఇచ్చి ఎన్నికైన నాటి నుంచి ప్రజలపై భారాలు మోపడం, మోసగించడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. గత ప్రభుత్వం అదాని కంపెనీలతో చేసుకున్న అక్రమ, అవినీతి ఒప్పందాలను కూటమి ప్రభుత్వం ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో 2000లో ఇదే చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా వామపక్షాలు సమరశీల పోరాటం సాగించాయని, ఆ సందర్భంగా బషీర్‌బాగ్‌లో జరిగిన పోలీస్ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారని గుర్తు చేశారు. ఫలితంగా తరువాత చంద్రబాబు పదేళ్ల అధికారానికి దూరమయ్యారని తెలిపారు. ప్రస్తుతం ట్రూఅప్, సర్ ఛార్జి తదితరాల పేరుతో వేస్తున్న విద్యుత్ భారాలను తక్షణం ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో విద్యుత్ ఉద్యమం ఉధృతం చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కాలంలో ఏజెన్సీలో భూ ఉద్యమం విస్తరించడంతో పాటు నిర్వాసితుల సమస్యలపై నికరంగా పోరాడే ఏకైక పార్టీ సిపిఎంగా గుర్తింపు పొందామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వాన జిల్లా మీదుగా సాగిన పోలవరం పోరుకేక పాదయాత్ర నిర్వాసితులను కదిలించిందని తెలిపారు. మైదాన ప్రాంతంలో ఎర్రకాల్వ మిగులు భూములు, దోసపాడులో అసైన్డ్ భూముల పోరాటం ఉధృతంగా సాగుతోందన్నారు. ఉపాధి హామీ ధాన్యం బకాయిలు, రైతాంగ సమస్యలపై పోరాటాలు సాగించడంతో పాటు మంచి ఫలితాలు సాధించామన్నారు. ఏజెన్సీలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నామని, దీంతో ప్రభుత్వం పునరాలోచనలో పడిందని తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి సిపిఎం శ్రేణులన్నీ ప్రజలతో మరింత మమేకం కావాలని పిలుపు నిచ్చారు. ఈ నివేదికపై మండలాలు, రంగాల వారీగా ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, మొడియం నాగమణి, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

మహాసభ ప్రారంభం సందర్భంగా పతాకావిష్కరణ చేస్తున్న గుత్తికొండ కృష్ణారావు

అమరవీరులకు నివాళులర్పిస్తున్న నేతలు

# ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా.. గోపీమూర్తి ప్రమాణస్వీకారం

## మంత్రి నారా లోకేష్ అభినందనలు

ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన బొర్రా గోపీమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు వెలగపూడిలోని రాష్ట్ర అసెంబ్లీ భవన ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బొర్రా గోపీమూర్తికి మండలి ఛైర్మన్ శుభాకాంక్షలు తెలిపి, శాసన మండలికి సంబంధించిన నియమ, నిబంధనలు, కార్యకలాపాల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఎంఎల్‌సి గోపీమూర్తి భార్య క్రాంతిరేఖ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి రామభద్రం, కోశాధికారి పట్టాభి రామయ్య, ఉపాధ్యాయ నేతలు త్రిమూర్తులు, రమణరాజు, నరసింహయ్య, నాగబాబు, సుభాషిని, శివరామరాజు, శేఖర్, సూర్య కుమార్, అబ్రహం, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సిగా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరిస్తున్న గోపీమూర్తి

**గోపీమూర్తికి నారా లోకేష్ అభినందనలు..**

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎంఎల్‌సి గోపీమూర్తికి అభినందనలు తెలిపారు. వెలగంపూడిలో ఎంఎల్‌సిగా ప్రమాణం స్వీకారం చేసిన అనంతరం గోపీమూర్తికి నారా లోకేష్ ఫోన్ చేసి అభినందించారు. కంగ్రాట్యులేషన్స్ చెప్పి మీలాగే ఎంఎల్‌సిగా శాసనమండలం నుంచి నా రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని నారా లోకేష్ వ్యాఖ్యానించారని ఎంఎల్‌సి గోపీ మూర్తి తెలిపారు.

# 16న ముఖ్యమంత్రి పోలవరం పర్యటన

## సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - పోలవరం

ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి పోలవరం పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పోలవరంలో శనివారం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఎస్‌పి కె.ప్రతాప్ శివకిశోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు సమావేశపు హాల్లో అధికారులతో పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ ఉదయం సుమారు 10.45 నిమిషాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో పోలవరం ప్రాజెక్ట్ సైట్‌కు చేరుకుంటారని, అనంతరం డయాఫ్రమ్ వాల్, తదితర ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించి, పనులు వేగవంతం చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమయ్యేలా ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం డయాఫ్రమ్ వాల్, తదితర నిర్మాణ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. పనుల ప్రగతిపై ప్రాజెక్టు ఇంజినీర్లు కలెక్టర్‌కు వివరించారు. ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిశోర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని ప్రదేశాల్లో పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్త్ ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు సిఇ నరసింహమూర్తి, అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, ఎఆర్. డిఎస్‌పి చంద్రశేఖర్, పోలవరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

# ఏకపక్షంగా సాగునీటి ఎన్నికలు

**చాట్రాయి మండలం బూరుగుగూడెంలో ఘర్షణ, ఎన్నిక వాయిదా**

**పోలవరం కొత్త పట్టిసీమలో ఎన్‌ఒసి రగడతో వైసిపి నేతల నిరసన**

**మొగల్తూరు మండలం కాళీపట్నం, జగన్నాథపురంలో ఎన్నికలు బహిష్కరణ**

**ఏలూరు జిల్లా, పశ్చిమలోని అన్ని వాటర్ యూజర్స్ అసోసియేషన్లలోనూ కూటమి నేతలకే**

**17న వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా ముగిశాయి. శనివారం జరిగిన సాగునీటి సంఘాలకు సంబంధించిన వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రాదేశిక నియోజవర్గాల ఎన్నికల అన్నింటిలోనూ టిడిపి కూటమి నేతలే ఎన్నికయ్యారు. ఒకటి, రెండు చోట్ల వైసిపి నాయకులు పోటీకి సిద్ధమైన అధికార బలంతో కూటమి నేతలు సొంతం చేసుకోవడం, వాయిదా వేసిన పరిస్థితి నెలకొంది. ఇది అన్యాయమంటూ వైసిపి నాయకులు నిరసనలకు దిగినా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. అనేక వాయిదాల పర్వం కొనసాగిన అనంతరం ఎట్టకేలకు డిసెంబర్ 11వ తేదీన సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఏలూరు జిల్లాలో మేజర్ 92, మైనర్ 251, మీడియం - 11 మొత్తం 354 వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు, పశ్చిమలో మేజర్ 98, మైనర్ 14 వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. అందుకు సంబంధించి డిసెంబర్ 14వ తేదీ శనివారం ఉదయం నుంచి ఏలూరు, పశ్చిమ జిల్లాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ సాగింది. రెండో శనివారం సెలవు కావడంతో, ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు స్కూళ్లలో ఏర్పాటు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మేజర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు 12 మంది సభ్యులు, మైనర్ వాటర్ యూజర్స్‌కు ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు. తొలుత వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యుల ఎన్నికను పూర్తిచేసి, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలు కొనసాగాయి. సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయబోమని వైసిపి చెప్పడంతో ఏలూరు జిల్లాలో రెండు చోట్ల మినహా ఎక్కడా పోటీ అనేది లేకుండా పోయింది. దీంతో ఏకపక్షంగానే సభ్యుల ఎన్నిక జరిగింది. కొన్నిచోట్ల టిడిపి, జనసేన మధ్య పోటీ నెలకొనడంతో ఐదేళ్ల పదవీకాలంలో మూడేళ్లు టిడిపి, రెండేళ్లు జనసేన నాయకులు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవులను పంచుకున్న పరిస్థితి కొనసాగింది. సాగునీటి సంఘాల ఎన్నికలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమక్షంలో కొనసాగాయి. అందుకు సంబంధించిన బాధ్యతలను ముందుగానే అధికారులకు అప్పగించారు. ఏకపక్షంగా ఎన్నికలు కొనసాగడం గ్రామాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పలుచోట్ల పోటీచేసే అవకాశం ఉన్నప్పటికీ వైసిపి నాయకులు అధిష్టానం సూచన మేరకు వెనక్కి తగ్గినట్లు కనిపించింది. దీంతో అన్ని వాటర్ యూజర్ అసోసియేషన్ల పదవులు కూటమి నేతలకే దక్కాయి. ఈ నెల 17వ తేదీన ఏలూరు జిల్లాలో 14, పశ్చిమలో 14 వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నిలకు జరగనున్నాయి. ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రాజెక్టు కమిటీ ఎన్నికల తేదీని ప్రకటించనున్నారు.

**బూరుగుగూడెంలో ఎన్నిక వాయిదా, కొత్త పట్టిసీమలో రగడ..**

చాట్రాయి మండలం బూరుగుగూడెంలో సాగు నీటిసంఘం ఎన్నికల కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత నెలకొనడంతో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. శనివారం సాగునీటి సంఘం ఎన్నికలను అధికారులు సూరన్న చెరువు ఆయకట్టు ఆరు టీసీలు, బొల్లికుంట చెరువు ఆయకట్టు ఆరు టీసీలు సుబ్బన్న చెరువు ఆయకట్టు ఆరు మొత్తం 18 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా టిడిపి కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఓటర్ లిస్టులో పేర్లు తప్పుగా నమోదు చేశారని ఈ ఎన్నిక వాయిదా వేయాలంటూ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. తాము గెలుస్తామన్న కోపంతో లేనిపోని ఫిర్యాదులతో ఎన్నికలను వాయిదా కోరుతున్నారటూ వైసిపి నాయకులు జోక్యం చేసుకోవడంతో కొద్దిసేపు ఇరు గ్రూపులు అరుపులు, కేకలతో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఇరు గ్రూపుల నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రంలోని ఎన్నికల అధికారుల వద్దకు నెట్టుకుంటూ వెళ్లి అధికారులపై గొడవకు దిగి నామినేషన్ పత్రాలను చించి వేయడంతో ఘర్షణ మరింత పెరిగింది. ఒక్కసారిగా మూకుమ్మడిగా వచ్చి నామినేషన్ పత్రాలు చించేసిన కారణంగా ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వైసిపి నాయకులు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా కూడా ఓడిపోతామన్న భయంతో నామినేషన్ పత్రాలు చించి వేయడం ప్రజాస్వామ్యమా నిబంధనలను విరుద్ధమని, వారిపై చర్యలు తీసుకోవాలని యధావిధిగా ఎన్నికల జరపాలని సంబంధిత అధికారులను కోరారు. మరోపక్క పోలవరం మండలం కొత్తపట్టిసీమలో వైసిపి నాయకులు కావాలనే ఎన్‌ఒసి పత్రం ఇవ్వలేదంటూ స్థానిక వైసిపి నాయకుల నిరసనకు దిగారు. తాము అన్ని వాటర్ టాక్స్‌లు కట్టినప్పటికీ టిడిపి నాయకులకు ఇచ్చి, తమకు ఎన్‌ఒసి ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు పోటీచేసే అవకాశం లేకపోవడంతో ఏకగ్రీవంగా కూటమి నేతలు గెలిచినట్లు ప్రకటించారు. మొగల్తూరు మండలం కాళీపట్నం, జగన్నాథపురంలో జమిందారీ భూములు రిజిస్ట్రేషన్ కాకపోవడాన్ని నిరసిస్తూ ఎన్నికలు బహిష్కరించిన పరిస్థితి నెలకొంది, కాళ్ల మండలంలో ఏడు టీసీలకు సంబంధించి నామినేషన్లు వేయకపోవడంతో ఎన్నిక జరగలేదు. వాయిదాపడిన, ఎన్నిక కాని వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు మరోసారి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తివివరాలు వచ్చిన తర్వాత ఖాళీలు ప్రకటిస్తామని అధికారులు చెబుతున్నారు.



ఎన్‌ఒసి ఇవ్వలేదంటూ కొత్తపట్టిసీమలో నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు



బూరుగుగూడెంలో నామినేషన్ పత్రాలు చించేసిన వైనం

# రాజీ మార్గమే రాజ మార్గం

## జాతీయ లోక్‌అదాలత్‌లో పలు కేసులు రాజీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 2024లో నాలుగో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభ సభలో జిల్లా జడ్జి మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, కుటుంబ వివాద, వాహన ప్రమాద కేసులను రాజీ చేసుకోవచ్చని చెప్పారు. నెల రోజుల నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల పరిధిలో కక్షిదారులతో మధ్యవర్తిత్వం నిర్వహించామని చెప్పారు. ఈ మధ్యవర్తిత్వం చక్కని ఫలితాలు ఇచ్చి ఎక్కువ కేసులను పరిష్కరించడానికి ఉపయోగపడిందని, భవిష్యత్తులో కూడా ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రత్యక్షంగా హాజరు కాలేని కక్షిదారులు ఆన్‌లైన్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాత్రి ఏడు గంటల వరకు 4985 పెండింగ్ కేసులను రాజీ చేసినట్లు తెలిపారు. ఇందులో 323 సివిల్ కేసులను, 4662 క్రిమినల్ కేసులను, 71 లిటిగేషన్ కేసులను రాజీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్, పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి ఎస్.సుమాసునంద, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బులికృష్ణ, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనె సీతారాం పాల్గొన్నారు.

**చింతలపూడి** : చింతలపూడి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 280 కేసులు పరిష్కారం చేసినట్లు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్, రికవరీ, చెక్ బౌన్స్, బిఎస్‌ఎన్‌ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు మొత్తం కలిపి 280 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌కు సంబంధించిన 14 కేసుల్లో మొత్తం రూ.43,580 అపరాధ రుసుమును చలానా ద్వారా గవర్నమెంట్‌వారికి చెల్లించి, అన్ని కేసులను కాంపౌండ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, పట్నాల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్

# వైద్యులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

## ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి సూచించారు. ఏలూరు నగరంలోని వైద్యులు ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా పేదలకు మెరుగైన సేవలందించేందుకు దృష్టి సారించాలన్నారు. ఏలూరు రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణ హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఆసుపత్రి వైద్యులు బి.కృష్ణను అభినందించారు. ప్రస్తుత సమాజంలో వైద్యం చాలా ఖరీదైన వస్తువుగా మారడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వ్యాపార దృక్పథాన్ని వీడనాడి, పేదలకు వైద్య సేవలందించాలన్న ఏకైక లక్ష్యంతో వైద్యులు పెద్దఎత్తున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి వైద్యుడు ఈ విధంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తే ఎంతోమంది పేదలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే నూతన సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, ఆర్నేపల్లి తిరుపతి, రెడ్డి నాగరాజు, బొద్దాని శ్రీనివాస్, విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు భూక్యా నాగేశ్వరరావు, డాక్టర్ కొడాలి రాము, డాక్టర్ కె.రవికిరణ్, బి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



వైద్యుడిని అభినందిస్తున్న ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

# చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

## అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంఎల్‌ఎ వెంకటరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

అంగన్‌వాడీలో చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలని గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు చెప్పారు. ద్వారకాతిరుమల మండలంలోని కొమ్మర గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో కలిసి కింద కూర్చుని భోజనం చేశారు. భోజనం ఎలా ఉందని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల హాజరు రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులకు కేటాయించిన పౌష్టికాహారం అందుతుందా లేదా అని అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు పాటించి శుద్ధికరమైన ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు లంక సత్యనారాయణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు దేవరపల్లి వీరాస్వామి చౌదరి, భీమడోలు సిఐ విల్సన్, ఎస్ఐ సుధీర్ పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వెంకటరాజు

# 83 వేల గోనెసంచులు సిద్ధం

**పోలవరం ఎఓ కె.రాంబాబు**

**ప్రజాశక్తి - పోలవరం**

మండలంలో వ్యవసాయ రైతుల అవసరాల కోసం 83 వేల గోనెసంచులు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వరికోతలు కోసిన రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పోలవరం రైతు సేవా కేంద్రం 1, 3ల వద్ద 30 వేల సంచులు, పట్టిసీమ రైతు సేవా కేంద్రంలో 14 వేల సంచులు, ప్రగడపల్లి రైతు సేవా కేంద్రంలో ఐదు వేల సంచులు, గూటాల రైతు సేవా కేంద్రం-1లో పది వేల సంచులు, గూటాల రైతు సేవా కేంద్రం-2లో 24 వేల సంచులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

# విద్యారంగం అభివృద్ధికి చర్యలు

**ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి**

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

విద్యారంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏలూరు శనివారపుపేట జెడ్‌పి హైస్కూల్ 40 వసంతాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. శనివారపుపేట జెడ్‌పి హైస్కూల్‌కు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. పాఠశాలకు అవసరమైన సదుపాయాలను రెండు సంవత్సరాల్లో సమకూర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్ఎను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ప్రకాశరావు, మాజీ ప్రధానోపాధ్యాయులు జోగేశ్వరరావు, అధ్యాపకులు సత్యనారాయణ, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ గునిపూడి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, లంకపల్లి మాణిక్యాలరావు, రెడ్డి నాగరాజు, గూడపల్లి శ్రీనివాస్, సోమిశెట్టి రాము, మట్ట రాజేశ్వరి, రంజిత్, కడియాల విజయలక్ష్మి, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు. కారంపూడి విజయ్, రాజేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



ఎఎన్.బాబుకు చిత్రపటం అందిస్తున్న సభ్యులు

# సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధిలో ఎఎన్.బాబు దంపతులు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్టి కళ్యాణ మహోత్సవాలు శనివారంతో తొమ్మిదో రోజుకు చేరాయి. మండలంలోని ఈడేపల్లికి చెందిన జనసేన నాయకులు ఎఎన్.బాబు దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎఎన్.బాబు దంపతులకు షష్టి ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి స్వామి వారి ఫోటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, షష్టి ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, వి.సురేష్, ఎస్.శివరామ్, పి.కృష్ణ, బి.సోమయ్య, కె.సుబ్బలక్ష్మి, డి.నాగలక్ష్మి, బిఎన్‌వి.రాధాకృష్ణ, పి.రమేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏజెన్సీ మండలాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాశక్తి - కుక్కునూరు**

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ కోరారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో కుక్కునూరు, తెల్లరాయిగూడెం, చుక్కలొద్ది గ్రామాల్లో గ్రామశాఖ కమిటీల సమావేశాలు పార్టీ మండల కార్యదర్శి కంగాల కల్లయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ వలస గిరిజనులు గత 25, 30 ఏళ్లుగా ఆవాసాల్లో 20 గ్రామాలను నిర్మించుకుని రెక్కల కష్టంపై ఆధారపడి కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వర్షాకాలంలో అనేక రోగాల బారినపడి సకాలంలో సరైన వైద్యం అందక చనిపోతున్నారన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు కనీస మౌలిక వసతులు కూడా లేవన్నారు. వీరికి ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కేంద్ర ట్రైబల్ కమిషన్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ వీరి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. స్థానిక ఆదివాసీలు ఏళ్ల నుంచి సాగు చేస్తున్న పోడు భూములకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టా హక్కుల కోసం దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ ఇవ్వలేదన్నారు. స్థానిక ఆదివాసీలు, వలస గిరిజనులు కలిసి వందలాది మందితో 2025 జనవరి 6న కొంరాంచంద్రాపురం ఐటిడిఎ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి సోయం చండ్రరావు, పార్టీ డివిజన్ నాయకులు ఎస్‌కె.మున్ని, మండల నాయకులు ఎస్.ముత్యాలు, పి.వీరబాబు, ఎం.దేవయ్య, ఎం.అడమయ్య చంద్రయ్య పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని చేవూరుపాలెం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నం చిలకలపూడికి చెందిన దాసరి నాగమల్లేశ్వరరావు మండలంలోని సింగరాయపాలెం గ్రోవెల్ కంపెనీలో పని చేస్తుంటాడు. డ్యూటీ నిమిత్తం శుక్రవారం రాత్రి ఇంటి వద్ద నుంచి బైక్‌పై సింగరాయపాలెం బయలుదేరాడు. ఈ క్రమంలో నాగమల్లేశ్వరరావు చేవూరుపాలెం వచ్చేసరికి రోడ్డుపై ఉన్న కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య దాసరి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పేకాట స్థావరాలపై దాడి

**ప్రజాశక్తి - కలిదిండి**

పేకాట స్థావరాలపై దాడి చేసిన పోలీసులు 23 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం... మండలంలోని కాళ్లపాలెం, తాడినాడ గ్రామాల్లో పేకాట స్థావరాలపై ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 23 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.68,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట, కోడిపందేలు వంటివి నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

**ప్రజాశక్తి - భీమడోలు**

మండల పరిధిలోని ఆరు మేజర్, ఐదు మైనర్ సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ప్రశాంతంగా ముగిశాయని ఎన్నికల అధికారి భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి తెలిపారు. దీనిలో భాగంగా పోలసానిపల్లి ఎర్రచెరువు సాగునీటి సంఘానికి నిర్వహించిన ఎన్నిక ఏకగ్రీవం కూటమి సభ్యుల సహాయ సహకారాలతో సాధ్యమైందని సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. గతంలో రైతుల ఇబ్బందులు తొలగించేందుకు వ్యక్తిగత వ్యయంతో చెరువుకు కొన్ని పనులు చేపట్టినట్లు సర్పంచి గుర్తు చేశారు. ఇదే క్రమంలో 132 ఎకరాల ఆయకట్టు గల చెరువు అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ అధ్యక్షులు వీరవల్లి ఏడుకొండలు, ఉపాధ్యక్షులు దారాముక్కుల వెంకట సుబ్రహ్మణ్యం, ఇతర సభ్యులు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తామని సర్పంచి హామీ ఇచ్చారు. ఇక మేజర్ నీటి సంఘాల వారీగా వస్తే భీమడోలు సంఘానికి కె.వెంకటేశ్వరరావు (ప్రసాద్), ఉపాధ్యక్షుల ఎం.శివకుమార్, గుండుగొలను నీటి సంఘానికి అధ్యక్షులుగా డోకల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కాబోతుల సోమేశ్వరరావు, పూళ్ల నీటి సంఘానికి అధ్యక్షులుగా గంధం వెంకటలక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా గురజాల ఆంజనేయులు, అంబరుపేట (కురెళ్లగూడెం) నీటి సంఘానికి అధ్యక్షులుగా ఏపూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కేతినీడి సత్యనారాయణ, ఆగడాల లంక నీటి సంఘానికి అధ్యక్షులుగా గోలి రామారావు, ఉపాధ్యక్షులుగా పాండురంగరాజు ఎన్నికయ్యారు. ఇక మైనర్ సాగునీటి సంఘాల విషయానికొస్తే అంబరుపేట ఎర్ర చెరువు నీటి సంఘానికి అధ్యక్షులుగా డి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మల్లెల కృష్ణ, గ్రామ పరిధిలోని రెడ్డి కుంటచెరువు నీటి సంఘం అధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వరరావు, వి.డేవిడ్, దుద్దేపూడి కొత్తచెరువు నీటి సంఘం అధ్యక్షులుగా నెక్కంటి కార్తీక తేజ, ఉపాధ్యక్షురాలిగా అన్నెం రామతులసి ఎన్నికయ్యారు. వీరందరితో ఆయా గ్రామాల సర్పంచులు ప్రతిజ్ఞలు చేయిం చారు. పోలసానిపల్లి కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి వి.సాల్మన్‌రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

భీమడోలులో...

**టి.నరసాపురం :** మండలంలో సాగు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయని తహశీల్దార్ టిఎస్.సాయిబాబా తెలిపారు. మండలంలోని టి.నరసాపురం, అప్పలరాజుగూడెం, తిరుమలదేవిపేట, మక్కినవారిగూడెం గ్రామాల్లో నాలుగు నీటి సంఘాల ఎన్నికలు అధికారులు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నందమూరి విద్యాసాగర్ చెరువు అధ్యక్షులుగా కొనకళ్ల మోహన్‌కుమార్, మక్కినవారిగూడెం జమ్మిచెరువు అధ్యక్షులుగా దామిశెట్టి కేశవరావు, తిరుమలదేవిపేట లక్ష్మీనరసింహసాగర్ చెరువు అధ్యక్షులుగా గండబోయిన అప్పలనారాయణ, అప్పలరాజుగూడెం, అప్పలరాజు చెరువు అధ్యక్షులుగా తాళ్ల దుర్గారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఎన్నికైన అధ్యక్షులను కమిటీ సభ్యులను పలువురు నాయకులు అభినందించారు.

**జీలుగుమిల్లి :** మండలవ్యాప్తంగా ఆరు నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించగా ఐదు ట్యాంకులకు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ స్లీవజోజి తెలిపారు. జీలుగుమిల్లి ఊర చెరువు అధ్యక్షురాలిగా చిర్రి సుగుణ, మడకంవారిగూడెం రాట్నల కుంట ట్యాంకుకు అధ్యక్షుడిగా కుంజ గోవిందరావు, దిబ్బగూడెంలోని పెరికిల వాగుకు మడకం రాముడు, దర్బగూడెంలోని అశ్వారావుపేట ఆన కట్టుకు అలవల శ్రీనివాస్‌రెడ్డి, గోపాలపురంలోని బంగారు పాపమ్మ చెరువుకు కుంజ వెంకటేష్, అశ్వారావుపేట వాగు అధ్యక్షుడిగా కొర్లపాటి రామకృష్ణారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

**చింతలపూడి :** మండలంలో నీటిసంఘం ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. 18 చెరువులకు కూటమి నాయకులు ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**ముసునూరు :** మండలంలో మేజర్ ఆరు సాగు నీటి సంఘాలు, మైనర్ 16 సాగునీటి సంఘాలు మొత్తం 22 నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. మండలంలోని 16 గ్రామాల్లో టిడిపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముసునూరులో దేవర చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గోగం కాసులు, నల్లచెరువు సాగునీటి సంఘం అధ్యక్షులుగా తలకొండ నాగరాజు, మేజర్ సాగునీటి సంఘం అధ్యక్షులుగా రాపర్ల బాలకృష్ణ, తుమ్మల లక్ష్మణరావు, తుమ్మల నాగేశ్వరరావు, కొల్లి గంగారామ్ పలువురు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

**ముదినేపల్లి :** మండలంలో కోడూరు, పెదపాలపర్రు, గురజ, దాకరం, పెదగొన్నూరు, కోమర్రు, బొమ్మినంపాడు, పొద్దువాక, వైవాక, వాడవల్లి, పెదతుమ్మిడి, వణుదుర్రు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ముదినేపల్లి తహశీల్దార్ జెఎస్.సుభాని శనివారం తెలిపారు. మండలంలో 12 సాగునీటి సంఘాలకు 144 టిసి సభ్యులకు 139 టిసిలు ఏకగ్రీవమైనట్లు చెప్పారు. ఐదు టిసి సభ్యులకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు రైతులు ముందుకు రాకపోవడంతో ఎన్నిక జరగలేదన్నారు. కోడూరు సాగునీటి సంఘం అధ్యక్షులుగా తాతినేని లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా సూరపనేని నగేష్, పెదపాలపర్రు సాగునీటి సంఘం అధ్యక్షులుగా చాగుల్లా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గొడవర్తి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురజ నీటి సంఘం అధ్యక్షులుగా హనుమర పెర్నీడు, ఉపాధ్యక్షులుగా పరిమిశెట్టి శోభనాద్రి, దాకరం నీటి సంఘం అధ్యక్షులుగా టివి.రామకృష్ణారావు, ఉపాధ్యక్షులుగా ఎం.వీరరాఘవులు, పెదగొన్నూరు నీటి సంఘం అధ్యక్షులుగా గుడిసేవా సురేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా కట్టా కోటయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోమర్రు నీటి సంఘం అధ్యక్షులుగా పోతురాజు రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా రెడ్డి మధు, బొమ్మినంపాడు నీటి సంఘం అధ్యక్షులుగా క్యానం లక్ష్మి, ఉపాధ్యక్షులుగా నాయుడు జయశేఖర్, పొద్దువాక నీటి సంఘం అధ్యక్షులుగా చిరా వెంకట సత్య వర ప్రసాద్ సీతారాం, ఉపాధ్యక్షులుగా బోయిన సుబ్రహ్మణ్యం, వైవాక నీటి సంఘం అధ్యక్షులుగా పోతుమూడి సోమేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కరేటి రామాంజనేయులు, వాడవల్లి నీటి సంఘం అధ్యక్షులుగా సుధాబత్తుల సుధాకర్, ఉపాధ్యక్షులుగా కోలా సత్యనారాయణ, పెదతుమ్మిడి నీటి సంఘం అధ్యక్షులుగా పుప్పాల శ్రీధర్, ఉపాధ్యక్షులుగా కట్రగడ్డ సుబ్బారావు, వణుదుర్రు నీటి సంఘం అధ్యక్షులుగా పోసిన పాండురంగారావు, ఉపాధ్యక్షులుగా మైనిడి సీతారామయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహశీల్దార్ జెఎస్.సుభాని తెలిపారు.

**దెందులూరు :** మండలంలో నీటి సంఘం ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 180 టిసి సభ్యులు ఉండగా, 179 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దెందులూరు సోమసముద్రం ట్యాంక్ నుంచి ఒక టిసికి ఎలాంటి నామినేషన్ దాఖలు కాలేదు. మిగిలిన చోట్ల ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కాగా, వారు ఎన్నికైనట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. ఒక్క చోట మాత్రం తర్వాత ఎన్నిక నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. ఎన్నికలను తహశీల్దార్ సుమతి నీటి సంఘం ఎన్నికలు జరుగుతున్న కొవ్వలి, పోతునూరు, దోసపాడు, కంద్రిక నరసింహపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

**పోలవరం :** పోలవరం మండలంలో నీటి సంఘం ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని పోలవరం కొత్తూరు చెరువు, పట్టిసీమ కొవ్వాడ కాలువ, చెల్లాయమ్మ చెరువు, కొత్త పట్టిసీమ, మంగపతిబోదె, గూటాల, గణపతిగట్టు, నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో 30 సంఘాలకు జరిగిన ఎన్నికల్లో అన్ని సంఘాలు కూటమి అభ్యర్థులకే ఏకగ్రీవమయ్యాయి. పోలవరం కొత్తూరు చెరువు నీటి సంఘం ఛైర్మన్‌గా పోలవరం గ్రామానికి చెందిన పాదం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్‌గా పప్పుల బాలాజీ, సభ్యులుగా అల్లిమిల్లి నారాయణరావు, కామిశెట్టి పల్లి, గడుసుల కృష్ణ, యామల భద్రం ఎన్నికయ్యారు. పట్టిసీమ కొవ్వాడ కాలువ నీటి సంఘం ఛైర్మన్‌గా పందిటి పోశారావు, వైస్ ఛైర్మన్ రొంగల వెంకట్రావు, సభ్యులుగా వలవల సత్యనారాయణ, తెలగంశెట్టి నామానరేంద్రకుమార్, తెలగంశెట్టి దామోదరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రగడపల్లికి చెందిన ఒక టిసి ఎన్నిక అభ్యర్థి లేక ఆగింది. పట్టిసీమ చెల్లాయమ్మ చెరువు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో ఛైర్మన్‌గా సానా శ్రీనివాస్, వైస్ ఛైర్మన్‌గా పొన్నూరి వెంకటేశ్వరి, సభ్యులుగా ఒనిమిరెడ్డి పోశారావు, మాదేపల్లి మురళీకృష్ణ, వీరపురాజు సుబ్బారావు, మాదేపల్లి వెంకటరామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తపట్టిసీమ మంగపతిదేవి బోదె నీటి సంఘం ఎన్నికల్లో ఛైర్మన్‌గా వీరపుశెట్టి వెంకటరత్నం, వైస్ ఛైర్మన్‌గా ఇమ్మణి గణపతి రామారావు, సభ్యులుగా అక్కాబత్తుల చిన్నయ్య, రంభ వెంకటసూర్యనారాయణ, దవళ వీరన్న, మంతెన వెంకటసత్యనారాయణరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గూటాల, జనపతి, గట్టు చెరువు, నీటి సంఘం వినియోగదారుల ఎన్నికల్లో ఛైర్మన్‌గా తాళ్లపూడి వెంకటరమణ, వైస్ ఛైర్మన్‌గా తోట రాంబాబు, సభ్యులుగా జల్లేపల్లి అనీల్‌కుమార్, పులి ఆంజనేయస్వామి, నర్రా నాగేంద్రుడు, పలకంశెట్టి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**బూరుగుగూడెంలో స్వల్ప ఉద్రిక్తత**

**కొత్త పట్టిసీమలో వైసిపి నేతల నిరసన**

# బూరుగుగూడెంలో 18 టిసిలకు ఎన్నికలు వాయిదా

**చాట్రాయి :** మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో నీటి సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. సూరన్నచెరువు ఆయకట్టు ఆరు టిసిలు, బొల్లికుంట చెరువు ఆయకట్టు ఆరు టిసిలు, సుబ్బన్న చెరువు ఆయకట్టు ఆరు టిసిలకు ఎన్నికల అధికారులు ఎస్.సురేష్, డి.కృష్ణ, ఆంజనేయ బాబు, రెవెన్యూ సిబ్బంది ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. టిడిపి కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఓటర్ లిస్టులో పేర్లు తప్పుగా నమోదు చేశారని, రైతులను భయపెట్టి ఎన్నికల్లో ఓటు వేయడానికి వీల్లేదని బెదిరించారని, ఈ ఎన్నిక వాయిదా వేయాలని ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. తాము గెలుస్తామని లేనిపోని ఫిర్యాదులు చేసి ఎన్నికలను వాయిదా వేయించాలనే కుట్రతో ఈ విధంగా మాట్లాడుతున్నారని వైసిపి నాయకులు, కార్యకర్తలు అన్నారు. దీంతో ఇరు గ్రూపుల వారు ఘర్షణకు దిగడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఇరు గ్రూపుల నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఎన్నికల అధికారుల వద్దకు నెట్టుకుంటూ వెళ్లి అధికారులపై గొడవకు దిగి నామినేషన్ పత్రాలను చించివేశారు. ఎన్నికల అధికారులు మాట్లాడుతూ నామినేషన్ పత్రాలు చించివేసిన కారణంగా ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రెవెన్యూ కార్యదర్శి సునీత తహశీల్దార్ డి.ప్రశాంతికి తెలుపగా వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకుని చించివేసిన నామినేషన్ పత్రాలను పరిశీలించారు. అనంతరం ఇరుగ్రూపులతో మాట్లాడుతూ గొడవల నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేశామని, మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. వైసిపి నాయకులు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా కూడా ఓడిపోతామన్న భయంతో నామినేషన్ పత్రాలు చించివేయడం ప్రజాస్వామ్యం కాదన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని, యధావిధిగా ఎన్నికల నిర్వహించాలని సంబంధిత అధికారులను కోరారు. జరిగిన ఎన్నికల వివరాలను తహశీల్దార్ వెల్లడించారు. 18 గ్రామ పంచాయతీల్లో మొత్తం 144 నీటి సంఘాలకు 126 నీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యాయని, 18 టిసిలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయని తెలిపారు.

# విఆర్ఒ నిర్వాకం వల్లే పోటీలో పాల్గొనలేకపోయాం

**వైసిపి సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్**

**పోలవరం :** విఆర్ఒ నిర్వాకం వల్లే పోటీలో పాల్గొనలేకపోయామని వైసిపి సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్ ఆరోపించారు. కొత్త పట్టిసీమలో జరిగిన నీటి సంఘం ఎన్నికల విషయంలో ఆయన మాట్లాడుతూ కొత్తపట్టిసీమ గ్రామ పరిధిలో మంగపతిబోది సప్లయి కాలువ నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ఆరు ప్రాదేశిక నియోజకవర్గాలకు తమ అభ్యర్థులు నామినేషన్లు వేసే వీలు లేకుండా స్థానిక విఆర్ఒ వర్గం వినయ్ అధికార పార్టీ వారి నామినేషన్లు తీసుకుని ప్రతిపక్ష పార్టీల వారి నామినేషన్ల తిరస్కరించారని ఆరోపించారు. అభ్యర్థుల తాలూకా నీటి పన్నులన్నీ బకాయిలు లేకుండా మీ సేవ ద్వారా చెల్లించిన రశీదు ఉన్నప్పటికీ విఆర్ఒ అధికార పార్టీల అభ్యర్థులకు ఇచ్చే నిరభ్యంతర పత్రాలు రాసి ఇచ్చి ప్రతిపక్ష పార్టీల వారికి సంతకాలు చేసి పంపారన్నారు. ఎన్నిక జరుగుతున్న చోట ఉండమని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అక్కడ నుంచి ఉద్దేశపూర్వకంగానే తప్పించుకువెళ్లారని, అధికారులందరు కుమ్మక్కై దొడ్డిదారిన అధికార పార్టీల వారి నామినేషన్లు స్వీకరించి సింగిల్ నామినేషన్ అని ప్రకటించారన్నారు. ఇదే సంఘంలో గంగోలు పంచాయతీ ఉన్న ప్రాదేశిక నియోజకవర్గానికి అక్కడ గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చారని, ఆ ఒక్క టిసి ఎన్నికలో అధికార పక్షం ఓటమి చెంది ప్రతిపక్ష పార్టీ వారు విజయం సాధించారన్నారు. దీనిపై విఆర్ఒ వినయ్‌ను వివరణ కోరగా ప్రత్యర్థులు సమయం అయిపోయిన తర్వాత వచ్చారని చెప్పారు. దీనిని ఖండిస్తున్నట్లు గ్రామ సర్పంచి మైగాపుల విజయదుర్గ, ఎంపిటిసి సభ్యులు వలవల వరలక్ష్మి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు సానా రామకృష్ణ తెలిపారు.

గురుమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నేతలు

# గురుమూర్తికి పలువురు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి- ముదినేపల్లి**

రాష్ట్ర గౌడ సంఘం కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన వీరంకి గురుమూర్తిని మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం విజయవాడలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర గౌడ్ సంఘం ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వీరంకి గురుమూర్తిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగబాబు, బొర్రా చలమయ్య, శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు, వంగపండు నాగ వెంకట కుమార్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

# కళాశాల సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - కుక్కునూరు**

మండలంలోని కుక్కునూరు పంచాయతీలో కళాశాల రోడ్డులోని సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించినట్లు టిడిపి మండలాధ్యక్షులు నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి గుండా స్థానిక కెజెబివి స్కూలు, వ్యవసాయ కార్యాలయం, ఎంఇఒ కార్యాలయం, జూనియర్ కాలేజీ, విద్యుత్ కార్యాలయం, కిష్టరం గ్రామం ఉన్నందున వారందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండలంలోని ఉప్పేరు, అమరవరం, కొండపల్లి, దాచారం పంచాయతీల్లో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. మరిన్ని అభివృద్ధి చేస్తామని జనసేన మండలాధ్యక్షులు ములిశెట్టి యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, కుచ్చర్లపాటి రమణరాజు, పులి శ్రీనివాసరావు, జనసేన మండల ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, మొదుంపరపు వెంకన్నబాబు పాల్గొన్నారు.

# జనసేన వీరమహిళకు పరామర్శ

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

నూజివీడు పట్టణంలోని రెండో వార్డుకు చెందిన జనసేన పార్టీ వీర మహిళ విజయశ్రీ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బర్మా ఫణిబాబు ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. జనసేన పార్టీలో కష్టపడి పనిచేసిన విజయశ్రీ త్వరగా కోలుకుని ప్రతి కార్యక్రమాల్లో మళ్లీ చురుగ్గా పాల్గొనాలని బర్మా ఫణిబాబు తెలిపారు.

# వైద్య సిబ్బందిపై దాడి దారుణం

**నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ ఉద్యోగుల మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిరసన**

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో ఉన్న హెల్త్ అసిస్టెంట్‌పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ ఉద్యోగుల మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మీడియం సువర్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ శనివారం జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి పిహెచ్‌సిలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌పై ప్రవీణ్ అనే వ్యక్తి దాడి చేయడం దారుణమన్నారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ప్రసాద్, నాగేశ్వరరావు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

కుక్కునూరులో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

**కుక్కునూరు :** రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి మండల కేంద్రంలో ఉన్న పిహెచ్‌సి సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలని ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సున్నం శ్రీరాములుదొర డిమాండ్ చేశారు. ఈ మేరకు కుక్కునూరు పిహెచ్‌సిలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నల్ల రిబ్బన్ ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకురాలు తెల్లం వెంకాయమ్మ మాట్లాడుతూ ఇటీవల రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంపై దొరచింతలపాలెం పంచాయతీ శ్రీపురం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో సమయంతో సంబంధం లేకుండా వైద్య సేవలందిస్తున్న సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడులు చేయడం చాలా బాధాకరమన్నారు. మారేడుమిల్లి పిహెచ్‌సిలో డ్యూటీలో మహిళా సిబ్బందిపై దాడి చేసిన ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి హాస్పిటల్‌కి సెక్యూరిటీ గార్డులను నియమించేలా చర్యలు తీసుకుని సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, ఎఎన్ఎం టి.వెంకాయమ్మ, గంగాభవాని, భీమమ్మా, భూలక్ష్మి, పి.కృష్ణవేణి, రజిత, సీత, నాగమణి, ఎల్‌టి.నాగరాజు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ




సిఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

సిఎం సహాయ నిధి నిరుపేదలకు అత్యవసర సమయాల్లో ఆసరాగా నిలుస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తొమ్మిది మందికి రూ.12.62 లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంఎల్ఎ బడేటి చంటి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల్లో వైద్యం పొందలేని వారికి సిఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడేవారు ఎవరైనా వారి సమస్యను తన దృష్టికి తీసుకొస్తే సిఎం వద్దకు వెళ్లి వారికి సాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కొప్పుల వెంకట తులసీరత్నం, పెద్దిబోయిన రామకృష్ణ, తల్లిబోయిన వెంకటేశ్వరరావు, బాల నాగు వెంకట సుబ్బమ్మ, ఎండి హుస్సేన్, షేక్ ఇమామ్ ఖాశీం, వీరవల్లి రాంబాబు, గొరిపర్తి రాధికా సుభాషిణిలకు చెక్కులు అందించారు.

# పల్లెపాలెం గ్రామాలను పల్లవపాలెంగా మార్చాలి

**సిఎం చంద్రబాబుకు శ్రీనివాసరావు వినతి**

**ప్రజాశక్తి - కలిదిండి**

పల్లెపాలెం గ్రామాలను పల్లవపాలెం గ్రామాలుగా రాష్ట్ర వ్యాప్తంగా జిఒ ద్వారా మార్పు చేయాలని టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. సిఎం చంద్రబాబును కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు రాష్ట్రంలో సుమారు నలభై లక్షల మంది అగ్నికుల క్షత్రియ సామాజిక తరగగి ఉందన్నారు. వారిలో 30 ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారు ఉన్నారన్నారు. అగ్నికుల క్షత్రియుల సామాజిక తరగతికి ఏదైనా ఒక కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా నియమించాలని కోరినట్లు తెలిపారు. అగ్నికుల క్షత్రియుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఉన్న పల్లెపాలెంను పల్లవపాలెంగా పేరు మార్పు చేయడంతో పాటు ఏదైనా మరో ఛైర్మన్ పదవి ఇచ్చి అగ్నికుల క్షత్రియులకు సముచిత స్థానం కల్పించాలని కోరినట్లు తెలిపారు. టిడిపి బూత్ కన్వీనర్ తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, మోకా నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

**ప్రకటన**

**మహారాజశ్రీ తణుకు సీనియరు సివిలు జడ్జి వారి కోర్టులో**

**H.M.O.P.3/2024**

Between:

గంటా సాయి ...పిటిషనరు

మరియు

గంటా సత్యనారాయణ ...రెస్పాండెంటు

To.

గంటా సత్యనారాయణ, S/o.పెంటయ్య, D.No.14-1-2, C/o.ద్వారపురెడ్డి వెంకట్రావు, వెలమపేట, పెంటపాడు, పెంటపాడు మండలం, ప.గో.జిల్లా.

ఈ నెంబరు గ్రంథములో శ్రీకోర్టు వారు ఎన్నిపర్యాయములు నోటీసులు ఇచ్చియున్నప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచ్చున్నందున శ్రీకోర్టు వారు Substitute Service ద్వారా అనగా పేపరు ప్రకటన ద్వారా ది.**27-12-2024**వ తేదీన ఉదయం 10.30 ని॥లకు కోర్టులో హాజరు అయినను లేక మీరు ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలియపర్చుకొనవలెను. లేనియెడల పరోక్షముగా తీర్పు చెప్పబడును.

//కోర్టు ఆర్డరు//

M.Suvarna Raju
Bandaru Srinivasa Prasad
Advocates, Tanuku.
Cell: 9848499470, 7780107055